
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY ఖమ్మం KHAMMAM
శనివారం, 6 సెప్టెంబరు 2025



పాఠశాలల్లో క్రీడలకు

ప్రాధాన్యమివ్వాలి

- ప్రతీ విద్యార్థికి వారానికి 150నిమిషాల ఫిజికల్ యాక్టివిటీ తప్పని సరి చేయాలి 6
- జిల్లాలోని సర్కారు బడులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశాం
- పీడీ, పీఈటీ, కోచ్‌లతో కలెక్టర్ అనుదీప్ సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

అందరూ ఉత్తములేనట!

- జిల్లాలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు
- కమిటీ నియమ నిబంధనలు నామమాత్రమే..
- విద్యాశాఖలో వింత పోకడపై విమర్శలు



జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం..

కొత్తగూడెం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ బోధన, నైతిక విలువలు, సామాజిక సేవలు, విద్యార్థుల జీవితాల్లో జ్ఞాన విలువలు నింపే వారికి ప్రతీ ఏడాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను ప్రకటిస్తాయి. ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డుల కోసం కమిటీలు, కొన్ని నియమ నిబంధనలు ఉంటాయి. దరఖాస్తు చేసుకున్న వారిలో నియమ నిబంధనల ప్రకారం కమిటీ కొందరిని ఎంపిక చేసి.. వారి పేర్లను జిల్లా విద్యాశాఖ అధికారి ద్వారా కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపుతారు. ఇందుకు భిన్నంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఈ ఏడాది దరఖాస్తు చేసుకున్న వారందరితో పాటు మరికొందరి పేర్లు చేర్చి ఏకంగా 58మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది. వీరిలో పీజీహెచ్‌ఎంలు 5, స్కూల్ అసిస్టెంట్స్ 29మంది, ఎస్‌జీటీలు 18మంది, ఐఆర్‌టీలు 3, కేజీబీవీలో ఇద్దరిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రకటించింది. నియమ నిబంధనల ప్రకారం కాకుండా దరఖాస్తు చేసుకున్న 43మందికి అదనంగా మరో 15మంది పేర్లను చేర్చి మొత్తం 58పేర్లు ప్రకటించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో దరఖాస్తు చేసుకున్న వారిలో నిబంధనలు, మంచి మార్కులు

మిగతా 6లో

ప్రీ ప్రైమరీ..

ప్రారంభం ఎప్పుడో?







- ఆదేశాలు వచ్చి మూడు నెలలు పూర్తి
- అయినా ఇప్పటికీ ప్రారంభం కాని తరగతులు
- ఉమ్మడి జిల్లాలో 49 పాఠశాలల్లో ప్రారంభించాలని ఆదేశాలు
- నేటికీ ఉభయ జిల్లాల్లో ముందుకు సాగని స్కూళ్ల ఎంపికలు

ఖమ్మం ఖానాపురం హవేలి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా.. ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించక పోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తరగతులు ప్రారంభం ఎప్పుడో తెలియక ప్రైవేటు పాఠశాలలకు తమ పిల్లలను పంపిస్తున్నారు. ప్రభుత్వం లక్ష్యం మంచిదే అయినా.. విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం కారణంగా ప్రీ ప్రైమరీ విద్య ముందుకు సాగడం లేదనే వాదనలు వినవస్తున్నాయి. ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించేందుకు ఎంపిక చేసిన పాఠశాలల్లో సంబంధిత ప్రధానోపాధ్యాయులు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. తరగతులు ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కానీ నర్సరీలో చేర్చుకుంటారా, లేదా అన్న దానిపై స్పష్టత ఇవ్వలేదు. సాధారణంగా ప్రీ స్కూల్ దశలో నేర్పించే పాఠాలే ఇక్కడా బోధిస్తారు. పిల్లలకు ఆటపాటలతో బోధన ఉంటుంది. ఈ విద్యా సంవత్సరంలో యూకేజీని ప్రారంభించే యోచనలో ప్రభుత్వం ఉందని సమగ్ర శిక్షా అధికారులు చెబుతున్నారు. దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. కానీ నర్సరీ నుంచే తరగతులు ప్రారంభించే అవకాశం ఉంది. ఇందులో భాగంగానే పాఠశాలలో పిల్లలకు బోధించేందుకు ఒక విద్యా వలంటీర్, ఓ ఆయాను నియమించుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. పాఠశాల పరిధిలోని వారికే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆయాకు కనీస అర్హత 7వ తరగతి, విద్యా వలంటీర్‌కు ఇంటర్, ఆపై చదువు ఉండాలని ప్రభుత్వం తెలిపింది. ప్రధానంగా ప్రభుత్వ స్కూళ్లల్లో విద్యార్థుల చేరికను పెంచే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలనే నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తుంది.

అంగన్‌వాడీల పరిస్థితి ఏంటి ?

సాధారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ప్రాథమిక పాఠశాలలు నడుస్తుంటాయి. పూర్వ ప్రాథమిక విద్య కోసం ప్రభుత్వ విభాగంలో అంగన్‌వాడీలు ఉన్నాయి. వీటిలో పనిచేసే సిబ్బంది విద్యార్థులకు అక్షర బుద్ధులు నేర్పేందుకే పరిమితం కాకుండా మిగిలిన పనులు కూడా ఉండడం వల్ల పిల్లలపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించే అవకాశం లేకుండా ఉంది. కేవలం ప్రీ స్కూల్ కోసమే వారు పని చేయడం లేదు. గ్రామం లేదా వార్డు పరిధిలో గర్భిణులకు సేవలందించడం సహా

(మిగతా 6లో)

> రాష్ట్రంలో ప్రీ ప్రైమరీ (పూర్వ ప్రాథమిక) విద్యను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 49 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలని ఉత్తర్వులు జారీ చేసింది. కానీ నేటికీ ఒక్క పాఠశాల కూడా ప్రారంభం కాలేదు. ఖమ్మం జిల్లాలో 28, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 21 చోట్ల ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం ఈ ఏడాది జూలైలో విద్యాశాఖకు ఆదేశాలు జారీచేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరం (2025-26) నుంచే ఈ తరగతులను ప్రారంభించాలని ఆదేశించినా.. జిల్లా విద్యాశాఖ అధికారులు ఆ దిశగా ఎక్కడా ప్రయత్నాలు మొదలు పెట్టక పోవడం వెనుక కారణాలు ఏంటో తెలియని పరిస్థితి నెలకొంది.



ఆర్టీసీ.. అమ్మలాంటిది

- మహాలక్ష్మీతో ఆదాయం పెరుగుదల
- మంచి పని వాతావరణం ఉన్న డిపో సత్తుపల్లి 6
- ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సోలోమాన్

వినాయక నిమజ్జనంలో

అపశ్రుతి

- చెరువులో పడి యువకుడి గల్లంతు 7
- ముదిగొండ మండలం మాధాపురంలో ఘటన

8న స్వగృహకు టెండర్లు

- అప్రమత్తమైన ఉద్యోగ సంఘాలు
- దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు



ఖమ్మంలోని రాజీవ్ స్వగృహ సముదాయం

ఖమ్మం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ఉమ్మడి రాష్ట్రంలో నాటి వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులకు శాశ్వత ఇల్లు నిర్మించేందుకు ప్రవేశపెట్టిన రాజీవ్ స్వగృహకు ఎట్టకేలకు మోక్షం లభించబోతోంది. ఆ ప్లాట్ల విక్రయానికి ఈనెల 8న టెండర్ల ప్రక్రియ నిర్వహించబోతున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పేదలకోసం రాజీవ్ గృహకల్ప పేరుతో ఇల్లు నిర్మించగా ప్రభుత్వ ఉద్యోగులు అధికారులు తదితరుల కోసం రాజీవ్ స్వగృహ పేరుతో ఖమ్మం రూరల్ మండలంలోని పోలేపల్లి వద్ద సుమారు 575ప్లాట్లు నిర్మించారు. తర్వాత రాజశేఖర్‌రెడ్డి మరణించడం, కాంగ్రెస్ అధికారం కోల్పోవడం, రాష్ట్ర విభజన జరగడంతో గత ప్రభుత్వం రాజీవ్ స్వగృహ గురించి పట్టించుకోలేదు. తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమానికి రాజీవ్ స్వగృహను తిరిగి పూర్తయిన ప్లాట్లను కేటాయించడం అసంపూర్తిగా ఉన్న భవనాలను టెండర్ల ద్వారా కేటాయించడానికి నిర్ణయించింది. అందులో భాగంగా జిల్లాకు చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీజీవోలు, టీఎన్‌జీవోలు, రిటైర్డు ఉద్యోగులు కలిసి తమకు రాజీవ్‌స్వగృహ ప్లాట్లు కేటాయిస్తే అసంపూర్తిగా ఉన్న వాటిని పూర్తిచేసి తీసుకుంటామని సూచించడంతో ఖమ్మం రాజీవ్ స్వగృహ టెండర్లకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుని షెడ్యూల్ ప్రకటించింది. శనివారంలోపు టెండర్లలో పాల్గొనేందుకు దరఖాస్తులు తీసుకుని సోమవారం టెండర్లను ఓపెన్ చేయబోతున్నారు. 50శాతం పనులు మాత్రమే పూర్తి చేసుకుని అసంపూర్తిగా ఉన్న ఈ భవనాలను టెండర్లలో దక్కించుకున్న తర్వాత మిగిలిన పనులు పూర్తిచేసి.. స్క్వేర్‌ఫీట్ రూ.2500 చొప్పున ఉద్యోగులు, అధికారులు, రిటైర్డు ఉద్యోగులకు ప్రభుత్వ అనుబంధ సంస్థలకు కేటాయించాలని ఉద్యోగ సంఘాలు నిర్ణయించాయి. దీంతో టెండర్ల ప్రక్రియలో ఉద్యోగ సంఘాలు కూడా పాల్గొనబోతున్నాయి.

ఇప్పటికే బ్యాంకుల నుంచి కూడా ఉద్యోగ సంఘాలు రుణ సహాయానికి ఒప్పందం చేసుకున్నట్లు సమాచారం. అయితే కొందరు కాంట్రాక్టర్లు కూడా ఈ భవనాలు సొంతం చేసుకుని వ్యాపారపరంగా అధిక రేట్లకు అమ్ముకునేందుకు కూడా తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. దీంతో ఉద్యోగ సంఘాలు అప్రమత్తమై రాజీవ్ స్వగృహను ఎట్టి పరిస్థితిలోనూ దక్కించుకుని వైఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన లక్ష్యానికి అనుగుణంగా ఉద్యోగులకు అపార్టుమెంట్లు ప్లాట్లు కేటాయించాలని సమావేశాలు పెట్టి ప్రభుత్వం దృష్టికి స్వగృహ ప్లాట్లను తీసకుంటామని సూచించినట్లు తెలిసింది. మొత్తంమీద దశాబ్దకాలంగా అసంపూర్తిగా ఉన్న రాజీవ్‌స్వగృహ ప్లాట్లను సోమవారం నిర్వహించే టెండర్ల ద్వారా దక్కించుకుని సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులకు, రిటైర్డు ఉద్యోగులు సిద్ధమవుతున్నారు. దీంతో సుమారు రూ.70కోట్ల విలువైన భవనాలు కూడా వినియోగంలోకి రాబోతున్నాయి.



విద్యుత్ దీపాల వెలుగుల్లో ఖమ్మం ప్రకాష్ నగర్ మున్నేరు వంతెన

వినాయక.. వీడ్కోలిక..

- ముగిసిన గణేష్ నవరాత్రులు
- నేడు శోభాయాత్ర, నిమజ్జనం
- మున్నేటి వద్ద ఏర్పాట్లు పూర్తి



ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గణపతి నవరాత్రులు ముగిశాయి. భక్తులు వినాయక.. వీడ్కోలిక అంటూ నిమజ్జనానికి సిద్ధమయ్యారు. దీంతో చివరి రోజైన శుక్రవారం ఖమ్మంలోని గణపయ్య మండపాల వద్ద భక్తుల కోలాహలం కనిపించింది. విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు, హోమ పూజలను ఘనంగా నిర్వహించారు. 'గణేష్ మహారాజ్‌కు జై' అనే నినాదాలతో పందిళ్లను హోరెత్తించారు. శనివారం స్తంభాద్రి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నగరంలో శోభాయమానంగా జరగనుందని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వినోద్ లాహోటి తెలిపారు. నగరంలోని వినాయక విగ్రహాలు అన్ని గాంధీచౌక్ నుంచి శోభాయత్రగా బయలుదేరి కాల్వొడ్డులోని మున్నేరులో నిమజ్జనం చేయనున్నామన్నారు. మండప నిర్వాహకులు తప్పని సరిగా పోలీసుల సూచనల మేరకు వారు చూపించిన మార్గాల్లోనే శోభాయత్రకు తరలి రావాలని కోరారు. శనివారం సాయంత్రం 3 గంటల వరకు నగరంలోని అన్ని వినాయక విగ్రహాలు గాంధీచౌక్ చేరుకోవాలని, అక్కడి నుంచి శోభాయాత్రకు బయలుదేరాలని తెలిపారు. శోభాయాత్రలో భక్తులు సంప్రదాయ దుస్తులు మాత్రమే ధరించాలని సూచించారు. ఈ శోభాయాత్రకు మంత్రులు, కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులు హాజరై గణనాథులకు స్వాగతం పలికి శోభాయత్రను ప్రారంభిస్తారని లాహోటి తెలిపారు



భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం

స్వల్పంగా పెరిగి..

ఆపై తగ్గుముఖం

- 39.9 అడుగులకు గోదావరి నీటిమట్టం

భద్రాచలం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం స్వల్పంగా తగ్గుతోంది. గురువారం అర్ధరాత్రి 12 గంటలకు 42.3 అడుగులు ఉన్న ప్రవాహం.. శుక్రవారం ఉదయం ఐదు గంటలకు 42 అడుగులకు తగ్గింది. రెండు గంటల సేపు నిలకడగా ఉండి.. 8 గంటలకు 41.9 అడుగులకు తగ్గింది. మళ్లీ మూడు గంటల పాటు నిలకడగా ఉన్న నీటిమట్టం 10 గంటలకు 41.8 అడుగులు, మధ్యాహ్నం 12 గంటలకు 41.6కుతగ్గింది. 2గంటలకు 41.4 అడుగులకు తగ్గగా 3గంటలకు 41.6 అడుగులకు పెరిగింది. సాయంత్రం 4 గంటలకు 41.2, 5 గంటలకు 41 అడుగులకు తగ్గి.. రెండు గంటల పాటు నిలకడగా ఉండి 6గంటలకు 40.8, 8గంటలకు 40.4, రాత్రి 11గంటలకు 39.9అడుగులకు తగ్గుతూ వచ్చింది.

రామాలయ ఖ్యాతిని మరింత చాటండి

- వైదిక సిబ్బందితో భద్రాద్రి దేవస్థానం ఈవో దామోదర్ రావు
- అన్నదాన సత్రం, ప్రసాదాల పోటు పరిశీలన
- దేవస్థానం భూమిని విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక



స్టోర్స్‌ను పరిశీలిస్తున్న దేవస్థానం ఈవో

భద్రాచలం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ ఖ్యాతి మరింతగా చాటాలని రామాలయ వైదిక సిబ్బందిని దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు కోరారు. శుక్రవారం వైదిక సిబ్బందితో చిత్రకూట మండపంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు తాము రామయ్యకు నిర్వహించే వివిధ రకాల పూజలను వైదిక సిబ్బంది వివరించి విధుల్లో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. భద్రాచలం దేవస్థానం నిర్వహించే ఉచిత నిత్యన్నదానసత్రం, ప్రసాదాల తయారీ కేంద్రం పోటును, విక్రయ కేంద్రాలను, ప్రొవిజినల్ స్టోర్స్‌ను సైతం ఈవో పరిశీలించారు. వాటిని పరిశుభ్రంగా ఉంచేల చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా వస్త్రాలు విక్రయించే విభాగంను పరిశీలించారు. అలాగే భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి చెందిన

(.. మిగతా 6వ పేజీలో)

సొంత కమిటీలు చెల్లవు

బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు

ఖమ్మంస్పోర్ట్స్,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా కమిటీ అనుమతి లేకుండా ఎలాంటి నూతన కమిటీల నియామకాలు చెల్లవని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ అధిష్ఠానం నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారమే గ్రామ, మండల, జిల్లా కమిటీల నియామకాలు జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. అప్పటి వరకు నియోజకవర్గాల్లో చేపట్టే ఎలాంటి నియామకాలు చెల్లవని తెలిపారు. ఇటీవల వైరా నియోజకవర్గంలో కొణిజర్ల, ఏన్కూరు, జూలూరుపాడు మండలాలలో కొంతమంది ప్రకటించుకొన్న కమిటీలకు జిల్లా పార్టీకి అనుమతి లేదని తెలిపారు. పార్టీకి చెందిన మండల నాయకులు, కార్యకర్తలు పార్టీ క్రమశిక్షణ దాటొద్దని హెచ్చరించారు. అనవసరపు వివాదాలు తీసుకురావద్దని హితవు పలికారు. పార్టీ క్రమశిక్షణకు వ్యతిరేకంగా ఎవరైనా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆ ప్రకటనలో ఎమ్మెల్సీ తాతా మధు హెచ్చరించారు.

పాఠశాలల్లో క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

పీడీ, పీఈటీ, కోచ్‌లతో ఖమ్మం కలెక్టర్ సమీక్ష

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడల ప్రోత్సాహానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాఠశాలలో క్రీడల నిర్వహణపై శుక్రవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పీఈటీ, కోచ్‌లతో సమీక్షించారు. పాఠశాలల్లో చదువుపై అధికంగా దృష్టి సారించడం వల్ల క్రీడలు ఆడటం పట్ల విద్యార్థులకు కొంతఆసక్తి తగ్గిందన్నారు. విద్యార్థులు ఫిజికల్ ఫిట్నెస్‌తో ఉండటం, క్రీడలు ఆడటం చాలా కీలకమన్నారు. జిల్లాలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ప్రతి ఒక్క విద్యార్థికి వారానికి 150 నిమిషాలు ఫిజికల్ యాక్టివిటీ తప్పని సరిగా చేసేలా చూడాలన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లు, డంబెల్స్, ఇతర క్రీడా పరికరాలను పంపిణీ చేశామన్నారు. పాఠశాలల్లో ఉన్న ఖాళీ స్థలం, గ్రౌండ్ లెవెలింగ్ స్థానిక సంస్థల సహకారంతో చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా క్రీడా శాఖాధికారి సునీల్ రెడ్డి, పీడీ.లు, పీఈటీలు, స్పోర్ట్స్‌స్టేడియం కోచ్‌లు పాల్గొన్నారు.

కట్టలు వేశారు.. క్యూరింగ్ మరిచారు


సీసీ రోడ్డుపై వేసిన మట్టి కట్టలు

వైరా, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైరాలోని రిజర్వాయర్‌కు వెళ్లే రహదారిలో నిర్మించిన సిమెంట్ కాంక్రీట్ నిర్మాణానికి క్యూరింగ్ చేసే విషయంలో నిర్లక్ష్యం చూపుతున్నారు. ఐదు రోజుల కిందట కొంత దూరం సీసీ రోడ్డు నిర్మించారు. దానిపై మట్టి కట్టలు ఏర్పాటు చేశారు. మట్టి కట్టల మధ్యలో నీరు నిల్వ ఉంచి క్యూరింగ్ మాత్రం చేయటం లేదు. రూ.90లక్షల సుడా నిధులతో రిజర్వాయర్ రోడ్డులో ఇప్పటికే ఒకవైపు 15అడుగుల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మించారు. ఇప్పుడు రెండోవైపు 15అడుగుల వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నారు. జాతీయ ప్రధాన రహదారి నుంచి కొంతదూరం రిజర్వాయర్ రోడ్డులో సీసీ నిర్మించారు. ఈ సీసీ రోడ్డుకు క్యూరింగ్ మాత్రం చేయడం లేదు. మట్టి కట్టలు ఏర్పాటుచేసిన కాంట్రాక్టర్ వాటి మధ్యలో నీరు నింపకుండా వదిలేశాడు. దాంతో రోడ్డుకు క్యూరింగ్ లేకుండా పో యింది. సీసీ రోడ్డుకు కనీసం 15నుంచి 20రోజులు వాటర్ క్యూరింగ్ తప్పనిసరి. ఇప్పుడు వాటర్ క్యూరింగ్ లేనందున ఈ రోడ్డు నాణ్యతపై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయినప్పటికీ మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహ రిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా వాటర్ క్యూరింగ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్టీసీ అమ్మలాంటిది

- మహాలక్ష్మితో ఆదాయం పెరుగుదల
- మంచి పని వాతావరణం ఉన్న డిపో సత్తుపల్లి
- ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ సోలోమాన్



సత్తుపల్లి డిపోలో ఉద్యోగులతో మాట్లాడుతున్న ఈడీ సోలోమాన్

సత్తుపల్లి, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ అమ్మలాంటిది, సిబ్బంది అంతా అన్నదమ్ముల్లా, అక్కచెల్లెళ్లా సంస్థను కాపాడుకుంటూ అభివృద్ధి పథంలో నడిపించుకోవాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ పగిడిమర్రి సోలోమాన్ అన్నారు. గతంలో ఒడిదుడుకులలో ఉన్న ఆర్టీసీ... నేడు అనేక సంస్కరణలతోపాటు మహాలక్ష్మి స్కీంతో ఆదాయం పెరుగుతోందన్నారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోను ఈడీ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపో గ్యారేజీతోపాటు రికార్డులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. అంతకముందు డిపో ఆవరణలో మొక్కలు నాటి ఉద్యోగులతో మాట్లాడారు. సమాజంలో అనేక మార్పులు వచ్చాయని, 90వ దశకంలో బస్సులన్నీ నిండిపోయేవని, ఆ తర్వాత ప్రైవేట్ వాహనాల రాకతో బస్సులు ఎక్కించేందుకు రకరకాల సమస్యలు వచ్చాయని, మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి పూర్వ వైభవం వచ్చిందన్నారు. కరోనా సమయంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొన్న ఆర్టీసీని ముందుకు తీసుకెళ్లే క్రమంలో ఉద్యోగుల సమష్టి కృషితోపాటు ప్రయాణికులు ఆర్టీసీని ఆదరించారన్నారు. ప్రజల అవసరాలను తీర్చడంలో ఆర్టీసీ సంస్థలో మహిళా ప్రయాణీకులకు మహాలక్ష్మి పథకం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. రాష్ట్రంలో గ్రేట్ వర్క్ కల్చర్ ఉన్న డిపో సత్తుపల్లి అని, ఏటా రాష్ట్రస్థాయిలో అవార్డులు తీసుకోవటం గర్వకారణమన్నారు. ఉద్యోగులను అభినందిస్తే మరిన్ని విజయాలను సాధించవచ్చన్నారు. పురుషుల కోసం ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు కాంబినేషన్‌తోపాటు డీలక్స్, సూపర్‌లగ్జరీ, రాజధాని ఏసీ బస్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం శ్రీరామనవమి సందర్భంగా తలంబ్రాలను అందించడంలో ఉత్తమ సేవలందించిన కార్గో ఇన్‌చార్జీ మునీర్‌పాషా, వీబీఓ కిన్నెర ఆనందరావు, డ్రైవర్ జైపాల్‌లను అభినందిస్తూ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రీజియన్ మేనేజర్ ఏ.సరిరాం, డిప్యూటీ ఆర్ఎం మల్లయ్య, డీఎం యూ.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సిలివేరు సాహితి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

లంబాడా కులాన్ని ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

ఆదివాసీ సంఘాల రాష్ట్ర నాయకులు

భద్రాచలం,సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విరుద్ధంగా చేరిన లంబాడా కులాన్ని తక్షణమే ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదివాసీ సంఘాల రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. భద్రాచలంలో శుక్రవారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆదివాసీ సంక్షేమపరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోయం కామరాజు, సంయుక్త కార్యదర్శి ఈసాల సురేష్ తదితరులు మాట్లాడారు. ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించాలని దేశఅత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టును ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావు ఆశ్రయించడం సబబేనన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా గిరిజన కులాల జాబితాలో లంబాడా, బంజార కులాన్ని కలిపారని వారు ఆరోపించారు. ఇందుకు అనుసరించాల్సిన నిబంధనలను అనుసరించలేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎక్కడ లంబాడాలను, బంజారాలను కలపలేదన్నారు. 2011లో ఆదివాసీ సంక్షేమపరిషత్ హైకోర్టులో రిట్ పిటీషన్ ఫైల్ చేసిందని ప్రస్తుతం ఈ కేసు పెండింగులో ఉందన్నారు. సుప్రీంకోర్టులో సైతం ఆదివాసీ తొమ్మిది తెగలకు చెందిన మహిళలు గోండ్వాన పెద్దలు ఇతర ఆదివాసీ సంఘాల సహకారంతో 2018లో పిటీషన్ వేయగా సుప్రీంకోర్టు అనుమతించి న్యాయపోరాటం విచారణ చివరి దశలో ఉందన్నారు. అందులో భాగంగానే భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, మాజీ ఎంపీ సోయం బాబురావుతో పాటు ఇతర రాష్ట్రాల ఆదివాసీలు ఇంప్లీడ్ పిటీషన్ వేసి ఉన్నారన్నారు. వారికి ఆదివాసీ సంఘాల సంపూర్ణ మద్దతు ఉందని తెలిపారు. ఈ సందర్భంగా తమ నినాదాలను తెలిపే ప్లకార్డులను వారు ప్రదర్శించారు. ఈ సమావేశంలో ఏటీపీ రాష్ట్ర అధ్యక్షుడు కల్లూరి జయబాబు, ఆధార్ సొసైటీ స్టేట్ కమిటీ సభ్యులు పొడియం బాలరాజు, ఏఈడబ్ల్యూసీపీ రాష్ట్ర అధ్యక్షుడు తెల్లం వెంకటేశ్వర్లు, ఆదివాసీ నాయకులు మెట్ల పాపయ్య, రాంబాబు, పూనెం కృష్ణ, చుంచు రామకృష్ణ, గొగ్గల రామస్వామి, పాయం రవివర్మ, సీతయ్య పాల్గొన్నారు.


ప్ల కార్డులను ప్రదర్శిస్తున్న ఆదివాసీ సంఘాల నాయకులు

తప్పెవరిది?

- డయాలసిస్ పేషెంట్‌కు హెచ్ఐవీ నిర్ధారణ
- చికిత్సలో భాగంగా జనవరిలో రక్తం ఎక్కించిన వైద్యులు
- ఆగస్టులో చేసిన రక్తపరీక్షలతో వెలుగులోకి
- లబోదిబోమంటున్న కుటుంబ సభ్యులు

మణుగూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తప్పెవరు చేశారు తెలియదు కానీ విధి అతడి జీవితంతో ఆడుకుంటోంది. చికిత్సలో భాగంగా ఓ డయాలిస్ పేషంట్‌కు రక్తం ఎక్కించడం అతడికి శాపంగా మారింది. చివరకు అతడు ఓ హెచ్ఐవీ బాధితుడిగా మారాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో వెలుగులోకి వచ్చిన ఈ ఘటనతో అందరూ అవాక్కయ్యారు. దీనిపై బాధితుడి కుటుంబసభ్యులు శుక్రవారం మణుగూరు ఏరియా ఆస్పత్రి వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలానికి చెందిన ఓ 60ఏళ్ల గిరిజన వృద్ధుడు 2024లో కిడ్నీ సంబంధ సమస్యల బారిన పడ్డాడు. 2025లో వైద్యం కోసం మణుగూరు ఆసుపత్రిలోని డయాలిసిస్ కేంద్రానికి రాగా.. అతడికి డయాలిసిస్ చేసే ముందు రక్తన మూనాలను పరీక్షించి.. రక్తహీనత ఉందని నిర్ధారించారు. అనంతరం అతడిది బి పాజిటివ్ గ్రూప్ కాగా.. భద్రాచలం బ్లడ్ బ్యాంక్ నుంచి రక్తం తెప్పించి జనవరి నెల15న ఎక్కించారు. నాటినుంచి ఆగస్టు 15 వరకు ప్రతి నెల వారానికి మూడు సార్లు డయాలిసిస్ సేవలు అందించారు. ఆగస్టు 15న మరోసారి అతడి రక్తనమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించగా.. వారికి ఊహించని పరిణామం ఎదురైంది. అతడికి హెచ్ఐవీ పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో బాధితుడి కుటుంబసభ్యులు ప్రైవేటులో కూడా రక్త పరీక్షలు చేయించగా.. అక్కడ కూడా పాజిటివ్ రావడంతో వెంటనే మణుగూరులోని డయాలిసిస్ కేంద్రంలో ఆయనకు డయాలిసిస్ సేవలను నిలిపివేశారు. నాటినుంచి బాధితుడికి భద్రాచలంలోని హెచ్ఐవీ కేంద్రం నుంచి ఇందుకు సంబంధించి మందులను అందిస్తున్నారు. హైచ్ఐవీ పాజిటివ్ వారికి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో డయాలిసిస్ చేసే వెలుసు బాటు ఉండటంతో ఆ బాధితుడు అక్కడ సేవలు పొందుతున్నాడు. అయితే హైదరాబాద్ వెళ్లేందుకు అయ్యే ఖర్చులు భారంగా మారడంతో ఆ గిరిజనుడు.. శుక్రవారం మణుగూరు ఆసుపత్రికి తన బంధువులతో చేరుకుని డయాలిస్ కేంద్ర నిర్వాహకులను నిలదీశాడు. తన ఆరోగ్యంతో చెలగాటమాడారని ప్రాణాలను తీసే ప్రయత్నాలకు పాల్పడ్డారంటూ మండిపడ్డాడు. జనవరి నెల వరకు తనకు కేవలం కిడ్నీ సంబంధ సమస్య మాత్రమే ఉందని, నాడు డయాలసిస్‌కు ముందు చేసిన రక్త పరీక్షల్లో ఎలాంటి హెచ్ఐవీ పాజిటివ్ లేదని నిర్ధారణ అయిన తర్వాతే చికిత్స చేశారని బాధితుడు తెలిపాడు. అలాంటప్పుడు ఇప్పుడు తనకు హెచ్ఐవీ పాజిటివ్ ఎలా వచ్చిందో డయాలిసిస్ కేంద్ర నిర్వాహకులే తెలపాలని పట్టుబట్టాడు. ఈ క్రమంలో ఆసుపత్రిలో వాగ్వాదం, ఉద్రిక్తత వాగ్వాదం జరిగింది.

> ఈ విషయంపై ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కోటా మజినేకర్ సునీల్ మాట్లాడుతూ.. హెచ్ఐవీ వైరస్ అనేది రక్తంలో చేరిన మూడు నెలల తర్వాత టెస్టుల్లో బయట పడే అవకాశం ఉంటుంది. ఆసుపత్రిలో శుక్రవారం బాధితుల ఆందోళనపై
>
> **మూడు నెలలకు బయట పడుతుంది..**
>
> **సునీల్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్**
>
> మాట్లాడారు. డయాలిసిస్ కేంద్ర నిర్వహణ అంతా కొత్తగూడెంలో ఉన్న ప్రధాన డయాలిసిస్ కేంద్రంద్వారా జరుగుందన్నారు. అక్కడి జిల్లా ఇన్‌చార్జ్ శనివారం మణుగూరు రానున్నారని, వారిని నేరుగా సంప్రదించాలని బాధిత కుటుంబ సభ్యులకు తెలిపారు.

పొరపాటు ఎక్కడ జరిగింది..

కిడ్నీ సంబంధ బాధితుడికి హెచ్ఐవీ నిర్ధారణ అయిన అంశంపై డయాలిసిస్ కేంద్రంపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో పొరపాటు ఎక్కడ జరిగిందన్న విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులే తేల్చాల్సిఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనకు ఎవరు బాధ్యత వహిస్తారు? రక్తం ఎక్కించే క్రమంలో జరిగిన పొరపాటా? బ్లడ్ బ్యాంకు నుంచి తెప్పించిన రక్తం సరైందేనా? లేక సదరు వ్యాధి గ్రస్థులు ఇంకా ఏదైనా ప్రాంతంలో వైద్య సేవలు పొందాడా? అనే అనుమానాలకు జిల్లా అధికారులే తెరదించాల్సిన అవసరం ఉంది.

వేరే చోటకూడా వైద్యం పొందాడు..

డయాలిసిస్ సెంటర్ నిర్వాహకుడు సంతోష్ రెడ్డిని వివరణ కొరగా సదరు కిడ్నీ వ్యాధి గ్రస్థుడు మణుగూరు ఆసుపత్రికి రాకముందు హైదరాబాద్, ఖమ్మం, వరంగల్‌లోని పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందాడని, అక్కడేమైనా పొరపాటు జరిగి ఉండవచ్చన్నారు.

రోడ్డు మరమ్మతుల కోసం సీపీఎం నిరసన

వైరా, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైరా-మధిర, జగ్గయ్యపేట రూట్‌పై మండలంలోని తాటిపూడి గ్రామం వద్ద భారీ వర్షాలకు ధ్వంసమైన రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. రోడ్డుపై నిరసన తెలియజేసి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. తాటిపూడి వద్ద వంద మీటర్ల రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా ఉండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉందని ఆందోళన చేశారు. తాటిపూడి నుంచి చిన్నమునగాల వెళ్లే రోడ్డుకు రిపేర్లు చేయాలని లేనట్లయితే దశలవారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. వైరా, కొణిజర్ల మండలాల సీపీఎం నాయకులు సుంకర సుధాకర్, తాళ్లపల్లి కృష్ణ, చెరుకుమల్లి కుటుంబరావు,తూము సుధాకర్ పాల్గొన్నారు.

సింగరేణి ప్రధాన ఆస్పత్రి తనిఖీ

రుద్రంపూర్, (సింగరేణి), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ప్రధా న ఆసుపత్రిలో రోగుకలు అందుతున్న వైద్యసేవలను తెలుసుకునేందుకు సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూమెంట్) వెంకన్న జాదవ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రోగులకు అందుతున్న వైద్యసేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని సీఎంవో డాక్టర్ కిరణ్‌రాజ్‌కుమార్‌ను కోరారు. అనంతరం సింగరేణి సెంట్రల్‌వర్క్‌షాపు, మెయిన్‌వర్క్‌షాపులను తనిఖీచేశారు. కార్మికులు చేస్తున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఅండ్ఎం జీఎం దామోదర్‌రావు, వర్క్‌షాపు ఎజీఎం రాజీవ్‌కుమార్, ఆసుపత్రి వైద్యాధికారులు డాక్టర్ ఉషా, డాక్టర్ సునీల, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'తమ్మిలేరు'పై ప్రమాదాలు జరిగితేనే పట్టించుకుంటారా?

సత్తుపల్లిరూరల్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి పట్టణ శివారులోని తమ్మిలేరు వంతెనపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. జాతీయ రహదారిపై ఏళ్లక్రితం నిర్మించిన ఈ వంతెనపై ప్రయాణం ప్రాణసంకటంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. బ్రిడ్జీపై ప్రతిఏటా గుంతలు పడి ప్రమాదకరంగా మారుతుందని, తూతూమంత్రంగా మరమ్మత్తులతో సరిచేస్తూ చేతులు దులుపుకుంటున్న నేషనల్ హైవేస్ అధికారులు బ్రిడ్జి ఎలైన్‌మెంట్ మార్చడంతో నూతన బ్రిడ్జీని నిర్మించాలని పార్టీలకతీతంగా రాజకీయ నాయకులు, స్థానికులు, వాహనదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా బ్రిడ్జీపై ప్రమాదాల సమయంలో వాహనాలు కాలువలోకి పడిపోయినప్పుడు రెయిలింగ్ దెబ్బతినడంతో వెంటనే మరమ్మత్తులు చేయడం లేదని ఏదైనా ప్రమాదం జరిగేతేనే స్పందిస్తారా అంటూ పలువురు పెదవి విరుస్తున్నారు. ఇంకా బ్రిడ్జీకి రెండు వైపులా పిచ్చిమొక్కలు పెరగడంతో వచ్చేపోయే వాహనాలు కనిపించకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, మరిన్ని ప్రమాదాలు జరిగితేనే స్పందిస్తారా అంటూ వాహనదారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సాగర్ కాలువలోకి దూసుకెళ్లిన కారు

ఖమ్మం పెద్దతండాకు చెందిన ఒకరి మృతి

ఏదులాపురం మున్సిపాలిటీ గొల్లగూడెం వద్ద ఘటన


వెంకటేశ్వర్లు మృతదేహం

ఖమ్మం రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు ఓ కారు సాగర్ కాలువలోకి దూసుకెళ్లిన ఘటనలో డ్రైవింగ్ సీటులో కారు యజమాని మృతి చెందాడు. ఈ సంఘటన ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గొల్లగూడెం వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. ప్రమాదానికి గురైన కారులో పెద్దతండా గ్రామ పరిధిలోని సాయిగణేష్ నగర్‌కు చెందిన మర్లపాటి వెంకటేశ్వర్లు (38) మృతిచెందినట్టు పోలీసులు గుర్తించారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో ఎరువుల దుకాణం నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు అక్కడి నుంచి శుక్రవారం రాత్రి తన సొంత కారులో ఖమ్మం వస్తుండగా.. గొల్లగూడెం వద్ద అదుపుతప్పి సాగర్ కాలువలోకి దూసుకుపోయింది. ఆ కారు పడిన ప్రాంతం నుంచి సుమారు 100మీటర్ల దూరం వరకు ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోయింది. విషయం తెలుసుకున్న సీఐ రాజు వెంటనే గజ ఈతగాళ్లు, క్రేన్ సాయంతో సుమారు 3గంటల పాటు శ్రమించి కారును బయటకు తీశారు. డ్రైవింగ్ సీటులో ఉన్న వెంకటేశ్వర్లు మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించి.. కేసునమోదు చేశారు.

జల వికాసమెప్పుడో?

- 'గిరిజల వికాసం' కోసం రైతుల ఎదురు చూపు
- బెండాలపాడులో పైలెట్ ప్రాజెక్ట్‌గా అమలు
- తొలుత డిప్యూటీ సీఎం ప్రారంభించాల్సిన పథకం వాయిదా
- ఆ తర్వాత ప్రకటించిన ఇందిరమ్మ ఇళ్లు పథకాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి


పోడు రైతు భూమిలో ఏర్పాటు చేసిన సోలార్ పలకలు


పోడు భూముల్లోని బోరు బావికి అమర్చిన మోటారు

చంద్రుగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చంద్రుగొండ మండలం బెండాపాడు గ్రామంలో ఇరువురి గిరిజన రైతుల పోడు భూముల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన ఇందిర గిరి జల వికాసం పథకం ప్రారంభం కోసం పోడు రైతులు ఎదురు చూస్తున్నారు. గత మే 10న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పథకం ప్రారంభిస్తారని ప్రకటించిన అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేశారు. కాగా ఏవో కారణాలతో కార్యక్రమం వాయిద పడింది. అయితే ఇదే గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. రెండు పైలెట్ ప్రాక్టులు బెండాలపాడు గ్రామస్తులకే దక్కినా వెనుక ప్రారంభించిన ఇళ్ల పథకం ప్రారంభం కాగా ముందు ప్రారంభం కావాల్సిన ఇందిర గిరి జల వికాసం పథకం ప్రారంభానికి నోచుకోలేదు. ఎప్పుడు ప్రారంభిస్తారో ఇటు అధికారులకు అటు పథకం లబ్ధిదారులైన పద్దం వెంకటేశ్వర్లు, రేసు నాగరాజుకు సమచారం లేదు.

పథకంపై ఆశలు పెట్టుకున్న పోడు రైతులు

పోడు భూములకు సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నూరు శాతం రాయితీతో ప్రవేశపెట్టిన ఇందిర గిరి జల వికాసం పథకంపై జిల్లాలోని వేలాది పోడురైతులు ఆశలు పెట్టుకున్నారు. బెండాలపాడులోని పైలెట్ ప్రాజెక్టు ప్రారంభమైతే ఇక జిల్లాలోని పోడు రైతులకు ఈ పథకం అందుతుందని ఇటు మండలంలోని పోడు రైతులు అటు జిల్లా పోడు రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. రెండున్నర ఎకరాల పోడు భూమి పట్టా పొందిన ప్రతి రైతుకు రూ 6 లక్షల విలువైన పథకం అందనున్నది. ఈపథకంలో బోరు బావితో పాటు, 5 హెచ్‌పీ మోటారు, పైపులు, సోలార్ ప్లేట్లు తదితర సామాగ్రిని ఏర్పాటు చేయటం జరుగుతుంది. ఈ పథకం పూర్తి స్థాయిలో అమలు జరిగితే పోయిన అడవి ప్రాంతంలో పచ్చదనం పరవడిల్లిదని అటవీ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అడవుల అభివృద్ధికి కృషి చేయండి

- ఆళ్లపల్లి, రేగళ్ల రేంజ్‌లను సందర్శించిన పీసీసీఎఫ్ సువర్ణ
- ఈగిల్స్ నెస్ట్ క్యాంపింగ్ సైట్‌ను ప్రారంభం


ఈగిల్స్ నెస్ట్ క్యాంపింగ్ సైట్ ప్రారంభిస్తున్న పీసీసీఎఫ్, అటవీశాఖ ఉన్నత అధికారులు

ఆళ్లపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అంతరించిపోతున్న అడవులను పునరుద్ధరించి వన్యప్రాణి సంరక్షణ కోసం అటవీశాఖ అధికారులు కృషి చేయాలని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (పీసీసీఎఫ్) అధికారి సి.సువర్ణ అటవీశాఖ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆమె పాల్వంచ కిన్నెరసాని అభయారణ్యంలోని ఆళ్లపల్లి, రేగళ్ల రేంజ్ అడవులను సందర్శించారు. రేగళ్ల అడవుల్లోని రంగాపురం బేస్ క్యాంప్‌ను సందర్శించి అడవులను, వన్యప్రాణుల ఆవాస కేంద్రాలను, నీటి వనరులను పరిశీలించారు. గడ్డి మైదాన భూముల అభివృద్ధికి చేయవలసిన సలహాలు ఇచ్చారు. అనంతరం రంగాపురం అడవుల్లో ఈగిల్స్ నెస్ట్ క్యాంపింగ్ సైట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ భీమానాయక్, డీఎఫ్‌వో కృష్ణగౌడ్, ఎఫ్‌డీవో బాబు, ఎఫ్ఆర్‌వో జశ్వంత్ ప్రసాద్, కిరణ్, స్థానిక అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఇల్లెందులో పీసీసీఎఫ్ పర్యటన

ఇల్లెందురూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మండలంలో శుక్రవారం అటవీశాఖ ముఖ్యకార్యదర్శి (పీసీసీఎఫ్) సీ.సువర్ణ ఆకస్మికంగా పర్యటించారు. ఇటీవల ఇల్లెందు మండలం రొంపేడు గ్రామంలో మంత్రి సీతక్క ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లాంటేషన్‌ను పరిశీలించారు. ప్లాంటేషన్‌ను జాగ్రత్తగా కాపాడాలని అధికారులకు సూచించారు. అనంతరం సుబాష్‌నగర్ ప్రాంతంలోని కోరగుట్ట అర్బన్‌పార్క్‌లో వాచ్‌టవర్‌ను ఆమె ప్రారంభించారు. అర్బన్‌పార్క్ ప్రజల సందర్శనార్థం ఎప్పటి తెరచి ఉంచాలని, మార్నింగ్ వాకర్స్‌కు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్ బీమానాయక్, డీఎఫ్ఓ కృష్ణ గౌడ్, ఎఫ్‌డీఓ కరుణాకర్, రేంజర్ సోడె చలపతిరావు ఉన్నారు.

రామాలయ ఖ్యాతిని మరింత చాటండి

(5వ పేజీ తరువాయి)

భూమిని ఇతరులకు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం సామాజిక మాధ్యమాల్లో ఏపీలోని యటపాక జిల్లా పురుషోత్తపట్నం గ్రామంలో 16 సెంట్ల భూమి అమ్మకానికి ఉందని రామాలయంకు సమీపంలో ఉన్న ఇక్కడ ప్రశాంతమైన జీవనం జీవించవచ్చు అంటూ అందులో పేర్కొని ఒక ఫోన్ నెంబరు పొందుపరిచారు. ఈ విషయం తమ దృష్టికి వచ్చిందని భద్రాచలం దేవస్థానం ఈవో దామోదర్‌రావు తెలిపారు.భద్రాద్రి దేవస్థానం పేరిట ఉన్న భూముల్లో మీరు ఏ విధంగా అమ్ముతారంటూ వారిని ప్రశ్నించినట్లు తెలిపారు. ఎవరైనా దేవస్థానం భూమి విక్రయించాలని చూస్తే ఎవరు కొనుగోలు చేయవద్దని చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

అందరూ ఉత్తములేనట!

(5వ పేజీ తరువాయి)

వచ్చిన వారిని మాత్రమే ఎంపిక చేస్తారు. కానీ భద్రాద్రి జిల్లాలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ అవార్డులు ఇవ్వడం విశేషం. ఈ విషయమై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇస్తామంటే.. తాము కూడా దరఖాస్తు చేసుకునే వారమని కొందరు ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేయడం గమనార్హం. భద్రాద్రి విద్యాశాఖ రూటే వేరు అని కొందరు ఉపాధ్యాయులు విచారం వ్యక్తం చేశారు. కానీ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఇందుకు భిన్నంగా 100శాతం ఉత్తీర్ణత సాధించిన 298మంది ఉపాధ్యాయులను సన్మానించడం విశేషం. ఉత్తీర్ణత శాతాన్ని మాత్రమే ప్రామాణికంగా తీసుకోవడంపై ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'ప్రీ ప్రైమరీ' ప్రారంభం ఎప్పుడో !?

(5వ పేజీ తరువాయి)

వివిధ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంది. వీరిలో ఎక్కువమంది పదో తరగతి వరకు చదివిన వారే ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రీ ప్రైమరీ ప్రారంభిస్తే అంగన్‌వాడీల పరిస్థితి ఏంటో తెలియని పరిస్థితి నెలకొంది.

ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభం

ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించడం మంచి నిర్ణయమే అయినా.. విద్యాసంవత్సరం ప్రారంభమయ్యాక మొదలుపెట్టడంపై తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 'పాఠశాలలు ప్రారంభించాక ప్రీ ప్రైమరీకి అడ్మిషన్లు తీసుకోవాలని ప్రభుత్వం చెబుతోంది. ఇప్పటికే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్పించి ఫీజులు కట్టిన తరువాత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్య అందించినా ప్రయోజనం లేదని పలువురు చిన్నారుల తల్లితండ్రులు వాపోతున్నారు. ఈ క్రమంలో 2026-27 విద్యా సంవత్సంలో పాఠశాలల ప్రారంభం నాటికి ప్రీ ప్రైమరీ కి అడ్మిషన్లు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

తల్లాడ, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం ఎన్టీఆర్ నగర్ సమీపంలో శుక్రవారం రాత్రి బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి దుర్మరణం చెందాడు. స్థానికుల సమాచారం మేరకు రామానుజవరం నుంచి తల్లాడ వైపు ద్విచక్ర వాహనంపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో కేదాడ మండలం కాపుగల్లు గ్రామానికి చెందిన మాదవరపు సైదులు(36) అక్కడికక్కడే మృతి చెందాడు. గత కొంత కాలంగా సైదులు స్థానిక బార్బర్ షాపులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.



భద్రాద్రిలో కొనసాగుతున్న
గణేష్ నిమజ్జనం

ఇప్పటి వరకు 731 విగ్రహాల రాక

కొత్తగూడెం బాబుక్యాంపు నుంచి వచ్చిన 24అడుగుల గణేష్ విగ్రహం

భద్రాచలం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం వద్ద పవిత్ర గోదావరిలో గణేష్ నిమజ్జనం 24 గంటలుగా కొనసాగుతోంది. గురువారం అర్ధరాత్రి నుంచి గణేష్ విగ్రహాల రాక ఊపందుకోగా మధ్యాహ్నం వరకు భారీగా విగ్రహాలు తరలిరావడం జరిగింది. దీంతో ఇప్పటి వరకు భద్రాచలంలోని గణేష్ నిమజ్జన ఘాట్‌కు 731 విగ్రహాలు తరలివచ్చినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కొత్తగూడెంలోని బాబు క్యాంపు నుంచి 24 అడుగుల గణేష్ విగ్రహం భద్రాచలంలోకి రాగానే విద్యుత్ శాఖ సిబ్బంది సహకారంతో జాగ్రత్తగా నిమజ్జన ఘాట్‌కు తరలించారు. అనంతరం ప్రత్యేక క్రేన్‌తో భారీ విగ్రహాన్ని పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. కాగా అర్ధరాత్రి నుంచి ఉదయం, మధ్యాహ్నం వరకు వచ్చిన విగ్రహాలను ముందుగా ఒడ్డుకు చేర్చి ఒడ్డున పెట్టి అనంతరం వాటిని విడతల వారీగా లాంచీలో తీసుకెళ్లి గోదావరిలో నిమజ్జనం చేస్తున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్లను మోహరించారు. అలాగే రెవెన్యూ, వైద్య, పోలీసు, పంచాయతీ, దేవస్థానం, విద్యుత్ సిబ్బంది నిమజ్జన ఘాట్ వద్ద సేవలందిస్తున్నారు.



నిమజ్జనానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు





కొత్తగూడెం నుంచి వచ్చిన భారీ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

గ్రామాల్లో వ్యాపిస్తున్న జ్వరాలు

వైరల్ ఫీవర్స్‌తో అల్లాడుతున్న ప్రజలు

కిక్కిరిసిన వైద్యశాలలు



ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న జ్వరపీడితులు



వైద్యం కోసం చిన్నారుల నిరీక్షణ

ఇల్లెందు టౌన్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): జ్వరాలు పెరిగిపోవడంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వర్షాలు కురిసి ఆగిపోవడంతో ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో ఎటుచూసినా జ్వర పీడితులు తీవ్రంగా పెరిగిపోతున్నారు. వైరల్ ఫీవర్లతోపాటు టైఫాయిడ్ తీవ్రంగా ప్రబలుతుంది. ఇల్లెందు పట్టణం, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన జ్వరపీడితులు ప్రతి రోజు వైద్యశాలకు వచ్చి చికిత్సలు పొందుతున్నారు. శుక్రవారం ఒక్కరోజే ప్రభుత్వ వైద్యశాలలో 356 మంది అవుట్ పేషెంట్లకు గాను 217మంది జ్వరపీడితులు ఉండటం, జ్వరాల తీవ్రతను తేటతెల్లం చేస్తోంది. పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా జ్వరాలు ప్రబలుతున్నట్లుగా వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ఇంట్లో ఒక్కరికి వైరల్ ఫీవర్ వస్తే మిగతా కుటుంబ సభ్యులు జ్వరాలతో బాధపడుతున్నారు. బస్తీల్లో పారిశుధ్య చర్యలను మరింత మెరుగుపర్చడంతో పాటు దోమల నివారణ కోసం ప్రత్యేక చర్యలు చేపడితేనే జ్వరాల పీడితులు తగ్గిపోయే అవకాశాలు ఉంటాయని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. వైద్యశాలకు రోగులు జ్వరంతో వస్తే చికిత్సలు తక్షణమే అందే పరిస్థితి కనిపించడం లేదు. వైద్యులు ఆలస్యంగా విధులకు రావడంతో పాటు ముందస్తుగానే వెళ్లిపోతున్నారని రోగులు ఆరోపిస్తోన్నారు. శుక్రవారం ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో చిన్నారులు వైద్యం త్వరితగతిన అందకపోవడంతో జ్వరంతోనే వెనుతిరిగివెళ్లిపోయారు. జ్వరాలను తగ్గించేందుకు ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటుచేయడంతో పాటు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండేవిధంగా అధికారులు చర్యలుతీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

మూడు నెలలైనా...

సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల విద్యార్థుల్లో అయోమయం - ఇంటర్ విద్యార్థులకు అందని పాఠ్యపుస్తకాలు

పాల్వంచ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్య ఊహల పల్లకీలో ఊరేగుతోంది. దీంతో విద్యార్థులు సైతం ఆ పల్లకీలో విహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థుల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. కళాశాలలు తెరిచి మూడు నెలలు గడిచినా నేటికీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందలేదు. దీంతో పాఠ్యాంశాలు అర్థం కాక విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించబడుతున్న 268 సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులు మొత్తం కలిపి 42,880 మంది విద్యనభ్యసిస్తున్నారు. వీరికి ఈ విద్యాసంవత్సరం జూన్ మొదటి వారంలోనే ప్రారంభమైంది. అయితే రాష్ట్ర వ్యాప్తంగా ఏ కళాశాలలోనూ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు నేటికీ అందలేదు. పాఠ్యపుస్తకాల కోసం ఇతర ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులపై ఆధారపడవలసిన పరిస్థితి. టిస్టు పేపర్లు, గైడ్లపై ఆధారపడకుండా కేవలం టెక్స్‌బుక్స్‌పై ఆధారపడే విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ఇదే తరహా పరిస్థితి కొనసాగితే ఆ ప్రభావం రాబోయే విద్యాసంవత్సరం అడ్మిషన్లు, ప్రస్తుత విద్యాసంవత్సరం ఉత్తీర్ణతాశాతాలపై పడే ప్రమాదం ఉందని లెక్చరర్లు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల యాజమాన్యాలను ప్రశ్నిస్తే తమ బిడ్డలను ఇబ్బందులకు గురి చేస్తారనే అభిప్రాయంతో ఈ విషయంలో తల్లిదండ్రులు మౌనంగా ఉంటున్నట్టు తెలుస్తోంది. జేఈఈ, నీట్ పరీక్షలపై ఆసక్తి ఉన్న విద్యార్థుల కోసం రాష్ట్ర వ్యాప్తంగా జిల్లాకు ఒక సెంటర్‌ను ఏర్పాటు చేశారు. వాటికి సిద్ధపడే విద్యార్థులకు కూడా పాఠ్యపుస్తకాలు అందించడంలో ఆయా జిల్లాల అధికారుల విఫలమయ్యారు. అలాంటి విద్యార్థులకు కూడా నేటికీ పాఠ్యపుస్తకాలు అందకపోవడంతో వారి భవిష్యత్ ప్రణాళికలు ప్రశ్నార్థకంగా మారాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 20 కళాశాలల్లో(ఫస్ట్, సెకండ్ ఇయర్‌లలో కలిపి) 3,200 మంది విద్యార్థులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుకుంటున్నారు.

దీనిపై టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జాయింట్ సెక్రెటరీ సక్రూనాయక్ స్పందిస్తూ.. విద్యార్థులకు కావలసిన పాఠ్యపుస్తకాల కోసం గతంలోనే ఇండెంట్ పంపించామన్నారు. అందుకు కావలసిన నగదును కూడా ఎప్పుడో జమ చేశామన్నారు. వీలైనంత త్వరగా పాఠ్యపుస్తకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హైదరాబాద్ తరలిన జీపీవో అభ్యర్థులు

సీఎం చేతుల మీదుగా నియామకపు పత్రాలు స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి) : జీపీవోలుగా ఎంపికైన అభ్యర్థులు శుక్రవారం హైదరాబాద్‌కు తరలివెళ్లారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో 253 మంది అభ్యర్థులను ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. బస్సును ఖమ్మం అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సీఎం చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకున్నారు. ఎంపికైన అభ్యర్థులను సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. నియామక ఉత్తర్వులు అందుకున్న 15 రోజుల్లో విధుల్లో చేరనున్నట్లు తెలిసింది. గత ప్రభుత్వం వీఆర్వోల వ్యవస్థను రద్దుచేసిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పాలనతో అధికారుల నియామకానికి నిర్ణయం తీసుకుంది. ఇటీవల నిర్వహించిన పరీక్షలో 253 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 240 మంది లోకల్, 13 మంది నాన్ లోకల్ అభ్యర్థులు ఎంపికయ్యారు. త్వరలో పోస్టింగులు కల్పించనున్నారని తెలిపారు.



హైదరాబాద్ తరలివెళ్తున్న జీపీవో అభ్యర్థులు

ఎస్సీ ఎస్టీ కేసుపై విచారణ చేపట్టిన డీఎస్పీ



విచారణ చేపడుతున్న డీఎస్పీ రవీందర్ రెడ్డి

కరకగూడెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఒక భూ తగాద విషయంలో జరిగిన వివాదంపై నమోదైన ఎస్సీ ఎస్టీ కేసును శుక్రవారం మణుగూరు డివిజన్ డీఎస్పీ రవీందర్ రెడ్డి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవీందర్ రెడ్డి పలువురుని విచారించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ కేసుపై విచారణ చేపడుతున్నామని విచారణ పూర్తి చేసి నివేధికను కోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడూళ్ళ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ముగ్గురిపై కేసు నమోదు, మరో ఏడుగురు పరారీ

రూ.2,610 నగదు, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం

దమ్మపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దమ్మపేట పోలీసులు దాడి చేసిన ఘటన చిన్నగొల్లగూడెం గ్రామంలో శుక్రవారం జరిగింది. ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిన్నగొల్లగూడెం గ్రామ సమీపంలో తోటలో పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం మేరకు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా, మరో ఏడుగురు పారిపోయారు. వీరి వద్దనుండి రూ2610 నగదు, మూడు ద్విచక్రవాహనాలు, స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యూరియా కొరత కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు పోతినేని



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు పోతినేని సుదర్శన్

కొత్తగూడెం టౌన్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి) : రైతాంగానికి యూరియా కొరత రావడానికి కేంద్ర ప్రభుత్వవైఫల్యమే ప్రధాన కారణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు పోతినేని సుదర్శన్ ఆరోపించారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. శుక్రవారం మంచికంటిభవన్‌లో జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక లోపంకారణంగానే యూరియా, డీఏపీకి ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. తెలంగాణతోపాటు 11రాష్ట్రాల్లో యూరియా కొరత అధికంగా ఉందని తెలిపారు. రైతుల ఆందోళనలకు సీపీఎం సంపూర్ణ మద్దతును ఇస్తుందన్నారు. యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలకుండ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దళారులు, అవినీతి పరులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. యూరియా బ్లాక్‌మార్కెట్‌లో ఉంటే దాన్ని సీపీఎం ఆధ్వర్యంలో రైతులకు పంచుతామని హెచ్చరించారు. రైతులకు సరిపడ యూరియాను అందించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, నాయకులు అన్నవరపు కనకయ్య, ఏజే. రమేష్, నర్సారెడ్డి, జ్యోతి, బ్రహ్మాచారి, లిక్కి బాలరాజు, అన్నవరపు సత్యనారాయణ, భూక్య రమేష్, వంశీ, నరేష్, అర్జున్, ధర్మా పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లల తండ్రి.. మైనర్‌తో ప్రేమ

కుటుంబీకులు ఆగ్రహించడంతో బాలిక సహా ఆత్మహత్య

భద్రాచలంలోని ఓ ప్రైవేట్ లాడ్జిలో ఘటన

మృతుడిది ఏపీలోని ఏలూరు జిల్లా పెదరావిగూడెం



ఎస్.రవి (ఫైల్)

భద్రాచలం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అతడికి వివాహమైంది. భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కానీ తనకు దూరపు బంధువైన ఓ బాలికతో కొన్ని నెలల క్రితం ప్రేమలో పడ్డాడు. ఈ విషయం తెలిసిన అమ్మాయి కుటుంబీకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వద్దని వారించారు. అయినా వినలేదు. దీంతో తమ కూతురిని ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోక్సో కేసు పెట్టి అరెస్టు చేశారు. రిమాండ్‌కు వెళ్లిన అతడు బెయిల్‌పై బయటకొచ్చిన తర్వాతకూడా తీరు మార్చుకోలేదు. తమ ప్రేమకు ఇరు కుటుంబాల వారు అడ్డుపడుతున్నారన్న మనస్తాపంతో ఆ బాలికను ఓ హోటల్‌కు తీసుకొచ్చి.. ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలివీ.. ఏపీలోని ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం పెదరావిగూడెం గ్రామానికి చెందిన డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించే ఎస్.రవి(34).. తనకు దూరపు బంధువైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలానికి చెందిన ఓ బాలిక(16) ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఇద్దరూ భద్రాచలం వచ్చారు. కరకట్ట సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ లాడ్జిలో దిగిన ఆ ఇద్దరూ శుక్రవారం ఉదయం 8గంటల సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. ఆ సమయంలో గదిలో నుంచి వస్తువులు పడిన శబ్దాలు రావడంతో లాడ్జి సిబ్బంది వెంటనే అప్రమత్తమై తలుపులు తెరిచి అంబులెన్సులో ఇద్దరినీ భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి.. భద్రాచలం పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఈ క్రమంలో రవి వైద్యశాలకు వెళ్లేలోపే మృతి చెందగా.. బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న రవి, బాలిక కుటుంబ సభ్యులు వైద్యశాలకు చేరుకొని మృతదేహాలను చూసి విలపించారు. ఈ ఘటనపై భద్రాచలం సీఐ నాగరాజు కేసు నమోదు చేసుకున్నారు.

ఫిబ్రవరిలో రవిపై పోక్సో కేసు

రవికి భార్య, ముగ్గురు ఆడ పిల్లలున్నారు. దూరపు బంధుత్వం ఉన్న బాలికతో ప్రేమలో పడగా.. విషయం తెలిసిన అమ్మాయి కుటుంబసభ్యులు ఇద్దరినీ వారించారు. అయితే రవి పట్టించుకోకుండా బాలికతో ప్రేమ వ్యవహారం సాగిస్తుండటంతో ఆమె తల్లిదండ్రులు అశ్వాపురం పోలీసు స్టేషన్‌లో ఫిబ్రవరి 5న ఫిర్యాదు చేయగా.. పోలీసులు అతడిపై పోక్సో కేసు పెట్టి అరెస్టు చేశారు. రిమాండ్ నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన అనంతరం కూడా రవి ప్రవర్తన మార్చుకోలేదు. దీంతో ఇరు కుటుంబాల వారు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మనస్తాపానికి గురైన రవి, సదరు బాలికతో కలిసి ఆత్మహత్య చేసుకున్నట్టు సీఐ నాగరాజు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో రైస్‌మిల్లు కార్మికుడి మృతి

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోవాలని పలు రాజకీయ పార్టీల నాయకుల డిమాండ్

మృతుడి కుటుంబానికి రూ.20లక్షలు ఇచ్చేందుకు యాజమాన్యం అంగీకారం



రమేష్ (ఫైల్)

ఇల్లెందురూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మండలం బాలాజీనగర్ గ్రామ పంచాయతీలో బాలాజీ రైస్ మిల్లులో గురువారం రాత్రి విద్యుత్ షాక్‌తో రైస్‌మిల్లు ఆపరేటర్ పొల్లు రమేష్(45) మృతి చెందాడు. స్థానికుల, కుటుంబ సభ్యుల కథనం మేరకు రైస్‌మిల్లులో ఉన్న సీసీ కెమెరాను పరిశీలిస్తుండగా విద్యుత్ షాక్ తగలడంతో రమేష్ 20 అడుగుల ఎత్తు నుంచి కింద పడడంతో తీవ్రంగా గాయపడినాడు. దీంతో హుటాహుటీన గాయపడిన రమేష్‌ను ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించగా.. పరిస్థితి విషమించడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య కవిత ఇద్దరు కుమార్తేలు ఉన్నారు. కార్మికుడి మృతి విషయం తెలుసుకున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆవునూరి మధు, తుపాకుల నాగేశ్వరావు, బందం నాగయ్య, చిట్టిబాబు, మౌలానా, సారంగపాణి తదితరుల ఆధ్వర్యంలో మృతుని కుటుంబాన్ని యాజమాన్యం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యంతో సుదీర్ఘంగా చర్చలు జరిపాయి. అప్పటి వరకు మృతదేహానికి దాహన సంస్కారాలు చేయమని తెలపడంతో యాజమాన్యం దిగివచ్చి మృతుడి కుటుంబానికిని రూ.20లక్షలు ఇచ్చేందుకు అంగీకరించింది. అనంతరం దాహన సంస్కారాలను కూడా యాజమాన్యమే చేస్తామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

ఇద్దరు వ్యక్తులను ఢీకొట్టిన కారు

ఖమ్మంక్రైం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని బోనకల్ క్రాస్‌రోడ్డు సమీపంలో గురువారం ఇద్దరు వ్యక్తులను ఓ కారు ఢీకొట్టిన సంఘటన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అవుతుంది. ఈ మేరకు వివరాలిలా.. ఓ షాపులో నుండి ఇద్దరు వ్యక్తులు వారి ద్విచక్రవాహనం వద్దకు వచ్చి పరిశీలిస్తుండగా అతివేగంగా వచ్చిన ఓ కారు వారిని ఢీకొట్టింది. దీంతో సదరు వ్యక్తులకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కారును వెంటనే పక్కకు తీసి గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటన సీసీ కెమేరాలో రికార్డు కావడంతో ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

చెరువులో పడి యువకుడి గల్లంతు

ముదిగొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనానికి వెళ్లి చెరువులో ఓ యువకుడు గల్లంతైన సంఘటన ఖమ్మంజిల్లా ముదిగొండ మండలం మాధాపురం గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం... గ్రామానికి చెందిన పడిశాల సైదారావు(23)అనే యువకుడు వినాయక నిమజ్జనానికి వెళ్లి ప్రమాదవశాత్తూ చెరువులో జారిపడి గల్లంతయ్యాడు. గ్రామస్థులు చెరువులో గాలించినప్పటికీ శుక్రవారం రాత్రి వరకు ఆచూకీ లభించలేదు.

రోడ్డు ప్రమాదంలో బాలుడికి గాయాలు


బోనకల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఆరేళ్ల బాలునికి తీవ్ర గాయాలైనాయి. మండల పరిధిలోని ఆళ్లపాడు గ్రామానికి చెందిన మరీదు పరశురాం బోనకల్ ఆర్‌వోబీ పక్కన సర్వీసు రోడ్డులో ఎరువుల దుకాణం నిర్వహిస్తున్నాడు. షాపు ఎదుట ఆడుకుంటున్న అతని కుమారుడు యశ్వంత్‌ను గుర్తు తెలియని కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. గాయాలైన బాలుడిని గుర్తించిన తండ్రి పరశురాం మధిర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పరశురాం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కబ్జాకు గురైన చింతల చెరువు..?

ఆగిపోయిన మినీ ట్యాంక్ బండ్ పనులు

ఇరిగేషన్ అధికారులు చొరవ తీసుకోవాలంటున్న ప్రజలు

చెరువు నిండి ప్రధాన రోడ్డుపైకి ప్రవహిస్తున్న వర్షపు వరద నీరు



చుంచుపల్లి మండలంలోని విద్యానగర్ కాలనీలో ఉన్న కబ్జాకు గురైన చింతల చెరువు ఇదే

చుంచుపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యావంతుల వేధికైన విద్యానగర్‌కాలనీ గ్రామ పంచాయతీలోని చింతల చెరువు నేటికి అక్రమార్కులకు సొమ్ము చేసుకుంటూ కబ్జాలకు పాల్పడుతున్నారని సమాచారం. సర్వే నంబర్ 163-3లో ఉన్న చింతల చెరువు రెవెన్యూ రికార్డులో మొత్తం 12.18 ఎకరాలు ఉండగా ప్రస్తుతం ఎనిమిది ఎకరాలు మాత్రమే ఉందని తెలుస్తోంది. మిగతా 4.18 ఎకరాలు భూమిని గతంలో కబ్జాదారులు అక్రమంగా స్వాధీనం చేసుకొని వాటిని చదును చేసి క్రయ, విక్రయాలు చేసి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు బలంగా వినబడుతున్నాయి. కబ్జాలకు పాల్పడుతున్నారని పలు మార్లు ఫిర్యాదులు చేసినా ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడం లేదని స్థానిక పంచాయతీ ప్రజలు, చింతల చెరువు సరిహద్దుల నివాసుల ఆగ్రహిస్తున్నారు.

రూ. 2.50 కోట్లతో ప్రారంభమైన మినీ ట్యాంక్ బండ్

కొత్తగూడెం నియోజకవర్గంలోనే ఉమ్మడి చుంచుపల్లి గ్రామ పంచాయతీలో చుంచుపల్లి పంచాయతీ మేజర్, అతి పెద్ద గ్రామ పంచాయతీగా విరాజిల్లింది. చింతల చెరువు వద్ద ఏర్పాటు చేసిన బతుకమ్మ ఘాట్‌తో పాటు, చెరువును సుందరంగా తీర్చిదిద్దాలని సంకల్పంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలలో భాగంగా అప్పటి పాలకులు అభివృద్ధి చేయాలని ముందడుగు వేశారు. 2016 సంవత్సరంలో అప్పటి కొత్తగూడెం శాసన సభ్యులు కోరిక మేరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేసింది. రూ.2.50 కోట్ల వ్యయంతో మినీ ట్యాంక్ బండ్ పనులను అప్పటి ఇరిగేషన్ రాష్ట్ర మంత్రి హరీష్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. మొత్తం రూ.1.90 కోట్ల ఆదాయంతో మినీ ట్యాంక్ బండ్ పనులను అరకొరగా పూర్తయి వృదాగా మిగిలింది.

నిలిచిన నిర్మాణాలు.... కలగా మిగిలిన ట్యాంక్ బండ్

జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న విద్యానగర్ కాలనీలో ప్రజలకు ఉపయోగపడేలా , ఆహ్లాదకరమైన వాతావరణంలో మినీ ట్యాంక్ పనులను ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రారంభించారు. కాలక్రమేణ ట్యాంక్ బండ్ పనులు నిలిచిపోవడంతో ప్రభుత్వం వెచ్చించిన కోట్ల రూపాయలు ధనం వృదా అవడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ ట్యాంక్ బండ్‌లో వాకింగ్ ట్రాక్ అత్యాధునికంగా ఏర్పాటు చేశారు. ట్యాంక్ బండ్ మధ్య భాగంలోకి కాలినడకన వెళ్ళేందుకు సైతం మరో ట్రాక్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. చింతల చెరువులో సరిగ్గా నీటి మధ్య ఏర్పాటు చేసే చౌక చుట్టూ వాటర్ ఫౌంటెన్ కూడా నిర్మించారు. పాల్వంచలో కిన్నెరసాని ప్రాజెక్ట్ మాదిరిగానే కొత్తగూడెం, సమీప ప్రాంత ప్రజలకు చింతలచెరువు మినీ ట్యాంక్ బండ్ నిలుస్తుందని ఆశలు చిగురించిన అవి కళగానే మిగిలిపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే పనులను తిరిగి ప్రారంభించి పూర్తి చేయాలనే టూరిజం అభిమానులు కోరుకుంటున్నారు.

చెరువునిండి రోడ్లపైకి వర్షపు వరద నీరు

విద్యానగర్ కాలనీ పంచాయతీ కార్యాలయం వెనుక ఉన్న వెంకటేశ్వర కాలనీ, రామాంజనేయ కాలనీ పంచాయతీలలో వర్షం కురిసిన సమయాల్లో వరద నీరు చింతల చెరువుకి వచ్చి చేరుతుంది. జలకళతో కళకలలాడుతూ ఉప్పొంగి చప్టాల నుంచి వరద నీరు విద్యానగర్ కాలనీ ప్రధాన రహదారి అయిన కొత్తగూడెం - ఖమ్మం రోడ్డుపైకి చేరి చెరువును తలపిస్తుంది.

కబ్జాకు గురవలేదు... రక్షించుకుంటాం

విద్యానగర్ కాలనీలోని చింతల చెరువు కబ్జాకు గురవలేదు. సరిహద్దులను పర్యవేక్షిస్తూ రక్షించుకుంటున్నాము. గతంలో ఆనకట్టకు అనుకొని నిర్మాణాలు చేశారని తమకు వచ్చిన ఫిర్యాదుల మేరకు సంఘటన స్థలానికి చేరుకొని శాఖ పరమైన చర్యలు తీసుకున్నాం. ప్రస్తుతం చెరువు భూమిని కాపాడుకొనేందుకు ఉన్నత అధికారుల పర్యవేక్షణలో చర్యలు చేపడుతున్నామని డీఈ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

- కొత్తగూడెం ఇరిగేషన్ డీఈ రాంబాబు



చింతల చెరువులో నిర్మించుకున్న నిర్మాణాలు (ఫైల్)



ఆగిపోయిన ట్యాంక్‌బండ్‌లోని వాకింగ్ ట్రాక్ ఇదే



పారిశుధ్య లోపంతో విషజ్వరాలు

టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పారావు

కామేపల్లి, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం లోపించి విషజ్వరాలు వ్యాపిస్తున్నాయని టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్రప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు అన్నారు. శుక్రవారం కొత్తలింగాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో స్థానికసంస్థల ఎన్నికలు నిర్వహించకపోవడంతో గ్రామాల అభివృద్ధి ఎక్కడికి అక్కడే ఆగిపోయాయని, ఖమ్మం జిల్లాలో 20కి పైగా డెంగ్యూ కేసులు నమోదు అవుతున్న ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని వాపోయారు. ఆరోగ్య కేంద్రాల్లో సరిపడ సిబ్బందిలేక గ్రామీణ ప్రాంత వాసులకు సరైన వైద్య సేవలు అందడంలేదని అన్నారు.

అన్నదానాలు, కుంకుమ పూజలు

ఖమ్మంఖానాపురంహవేలి, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గణేష్ నవరాత్రులలో భాగంగా విశేష పూజలందుకున్న గణనాథుడిని శనివారం నిమజ్జనం చేయనున్నారు. శుక్రవారం నగరంలోని పలు గణేష్ మండపాల వద్ద అన్నదానాలు, కుంకుమపూజలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని బ్యాంకుకాలనీ, బైపాస్‌రోడ్ తారకరామ నగర్, బల్లేపల్లి రామాలయం వద్ద అన్నదానాలు నిర్వహించారు.ఇందిరానగర్‌లోని బాలగణపతి ఆలయంలో ఆలయ అర్చకుడు గిరిధర్, ఈవో నరసింహారావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

కూసుమంచి: నేలపట్లలో కుంకుమపూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

108 ప్రసాదాలతో వినాయకుడికి నైవేద్యం

నేలకొండపల్లి: సింగారెడ్డిపాలెంలోని శ్రీరామ మందిరంలో వినాయకునికి భక్తులు 108ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. రకరకాల పండ్లు, వంటకాలను ప్రసాదాలుగా సమర్పించారు.

కామేపల్లి:కొత్తలింగాలసెంటర్‌లో గొడవర్తి రంగయ్య, గొడవర్తి వాణీల జ్ఞాపకార్థం గొడవర్తి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శుక్రవారం గణేష్ మండపం వద్ద మహాఅన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిమజ్జన ఘాట్లను సందర్శించిన ఏడీసీపీ

ఖమ్మంక్రైం: నిమజ్జనం జరిగే ఘాట్లను శుక్రవారం అడిషనల్ డీసీపీలా అండ్‌ఆర్డర్ ప్రసాదరావు సందర్శించారు. ప్రకాష్‌నగర్ మున్నేరు,పెద్దతండా మున్నేరుతో పాటు ఇతర ఘాట్లను సందర్శించారు. విగ్రహవాహనాల రాకపోకల మార్గాలను పరిశీలించి ట్రాఫిక్‌జామ్ కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. ఈకార్యక్రమంలో సీఐలు మోహన్‌బాబు, బెల్లం సత్యనారాయణ పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి పూర్తి ఏర్పాట్లు

ఖమ్మంరూరల్: గణేష్ నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నాయుడుపేట మున్నేరు వద్ద నిమజ్జన ఘాట్‌ను శుక్రవారం సీఐ రాజు, ఆర్‌అండ్‌బీ డీఈ చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించారు. 60మంది సిబ్బంది, 15మంది అధికారులు కార్యక్రమంలో విధులు నిర్వహిస్తారన్నారు.32మంది గజఈతగాళ్ళు, 14మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. సీఐముష్కారాజు మాట్లాడుతూ ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు సహకరించి శోభయాత్ర విజయవంతం అయ్యేలా చూడాలన్నారు.మంగళగూడెం,తీర్థాల, పోలిశెట్టిగూడెం, గోళ్లపాడు గ్రామాలకు చెందిన విగ్రహాలను తీర్థాల ఆకేరులో నిమజ్జనం చేయాలని సూచించారు.



నిమజ్జన ఘాట్లను పరిశీలిస్తున్న ఏడీసీపీ ప్రసాదరావు

గంగమ్మ ఒడికి చేరిన గణనాథులు

తిరుమలాయపాలెం: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం గణేష్ నిమజ్జన వేడుకలను నిర్వహించారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో నిచెరువులో, ఆకేరు, పాలేరు నదుల్లో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు. పడమటితండాలో అన్నదాన కార్యక్రమాన్ని జిల్లాకాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్‌రెడ్డి ప్రారంభించారు.



నేలపట్లలో కుంకుమపూజలు



సాయిరాం టవర్స్‌లో..



కొత్తలింగాలలో మహాఅన్నదానం చేస్తున్న దృశ్యం







పడమటితండాలో పూజలు నిర్వహిస్తున్న నరేష్‌రెడ్డి, సింగారెడ్డిపాలెంలో 108 ప్రసాదాలతో వినాయకుడికి నైవేద్యం, 'ఆంధ్రజ్యోతి' కార్యాలయంలో పూజలో పాల్గొన్న దంపతులు

బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటే సత్తా చూపుతాం



మాట్లాడుతున్న శ్రీనివాస్

ఖమ్మంచర్చికాంపౌండ్,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల 42శాతం రిజర్వేషన్లను అడ్డుకుంటే బీసీల సత్తా చూపుతామని జాతీయ బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు, నారాయణవరపు శ్రీనివాస్, రాష్ట్రప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి అన్నారు. శుక్రవారం ఖమ్మంనగరంలో సంఘం కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. జనాభాలో 56శాతం ఉన్న ప్రజలకు న్యాయం చేయడం కోసం అన్ని రాజకీయపార్టీలు సహకరించాలని కోరారు. లేకుంటే ఏరాజకీయపార్టీని వదిలిపెట్టబోమని తెలిపారు. అనంతరం సంఘం జిల్లా నూతన కార్యదర్శిగా మసనం శివరామకృష్ణను నియమిస్తూ నియామకపత్రం అందించారు. ఈకార్యక్రమంలో లింగనబోయిన పుల్లారావు, గద్దె వెంకటరామయ్య, బోడ్డు కృష్ణ, మోడేపల్లి వెంకటాచారి, ఎనుముల రాముయాదవ్, పద్మశాలి సంఘం జిల్లా నాయకులు రచ్చశ్రీనివాసరావు, బండారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

10న సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సదస్సు

కొణిజర్ల,సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 10న నగరంలోని రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, రైతుసంఘంజిల్లా సహాయ కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం కొణిజర్లలో జరిగిన రైతుసంఘం సమావేశంలో మాట్లాడారు. పత్తిదిగుమతులకు సుంకం 11శాతం కొనసాగించాలని, జిల్లాలో ఖరీఫ్‌పంటలకు సరిపడా యూరియాను సరఫరా చేయాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మంబైపాస్‌రోడ్, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): మధ్యతరగతి ప్రజలకు ఊరట కలిగించేలా జీఎస్టీ పన్నును తగ్గించిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ ఆధ్వర్యంలో నగరంలోని జీఎస్టీ కార్యాలయం ఎదుట శుక్రవారం క్షీరాభిషేకం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరావు మాట్లాడుతూ 56వ మండలి సమావేశంలో తీసుకున్న ఈ నిర్ణయం దేశప్రజలకు శ్రీరామరక్ష వంటిదన్నారు. ముఖ్యంగా 12శాతం, 28శాతం ఉన్న స్లాబులను పూర్తిగా రద్దుచేసి నిత్యావసర వస్తువులను 5శాతం లేదా జీరో శాతం కిందకు తేవడం సామాన్యులకు భారీఉపశమనం కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకుడు గంటేల విద్యాసాగర్, సుబ్రహ్మణ్యం, మందడపు సుబ్బారావు, జ్వాల నరసింహారావు, రాఘవ, మంద సరస్వతి, రాజేష్, టేకుమట్ల వీరుగౌడ్, కుమిలి శ్రీనివాసరావు, సురేష్‌ప్రతప్ పాల్గొన్నారు.

నేలకొండపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి శుక్రవారం నేలకొండపల్లి వీఎస్సార్ సెంటర్లో బీజేపీ నాయకులు,కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు వలన నిత్యావసర వస్తువుల ధరలు భారీగా తగ్గి పేదలకు ఉపశమనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్రనాయకులు భవనాశి దుర్గారావు, జిల్లానాయకుడు మన్నె కృష్ణారావు, మైనార్టీ రాష్ట్రనాయకుడు షేక్.షర్ఫుద్దీన్ మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు నాయకులు సూరేపల్లి జ్ఞానరత్నం, బాజా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు





చలపతిరావుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



అవార్డు తీసుకుంటున్న చలపతిరావు

నేలకొండపల్లి, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): మండల విద్యాధికారి,ఆరెగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలిన చలపతిరావు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అవార్డును అందజేశారు. పాఠశాలకు విద్యార్థులు రావటానికి ఇబ్బంది పడుతున్న విషయాన్ని గమనించిన ప్రధానోపాధ్యాయుడు చలపతిరావు రెండు ఆటోలను ఏర్పాటు చేశారు. అందుకోసం సొంతకు నెలకు రూ.25వేలను వెచ్చిస్తున్నారు(ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు కలిసి).ట్యూటర్‌ను సైతం ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయునిగా, మండల విద్యాధికారిగా బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్న విషయాలను తెలుసుకున్న ముఖ్యమంత్రి స్వయంగా జిల్లా విద్యాధికారులకు ఫోన్ చేసి వివరాలను తెలుసుకున్నారు. అప్పటికప్పుడు హైదరాబాద్ ఆహ్వానించి ముఖ్యమంత్రి అవార్డును అందచేసి అభినందించినట్లుగా తెలుస్తున్నది. 2021లో సైతం చలపతిరావు ఉత్తమ ప్రధానోపాధ్యాయునిగా అవార్డు పొందటం విశేషం.

ఎస్టీ బాలికల వసతిగృహ అధికారికి ఉత్తమ సేవాపత్రం

తిరుమలాయపాలెం: తిరుమలాయపాలెం ప్రభుత్వ గిరిజన బాలికల పాఠశాలలోని వసతిగృహ సంక్షేమాధికారి పూలన్‌దేవికి శుక్రవారం ఐటీడీఏ పీవో రాహుల్ ఉత్తమసేవా ప్రశంసాపత్రం అందించారు.పూలన్‌దేవి తిరుమలాయపాలెం ఎస్టీ బాలికల వసతిగృహంలో సంక్షేమాధికారిగా వ్యవహరిస్తున్నారు. గతేడాది పదోతరగతి ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మంజుల

కామేపల్లి: కామేపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయురాలు మాలోత్ మంజుల ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ప్రశాంస పత్రాన్ని అందుకున్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన గురుపూజోత్సవంలో భాగంగా ఐటీడీఏ పీఓ రాహుల్ చేతులు మీదుగా అందుకున్నారు. మూడేళ్లుగా ఆమె సాంఘీకశాస్త్రంలో వందశాతం ఉత్తీర్ణతతో ఫలితాలు అందిస్తున్నారు.







వేలంపాటలో రూ.1.12 లక్షలు పలికిన లడ్డూ

తల్లాడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తమిట్టపల్లిలో వినాయకుడి లడ్డూ వేలంపాట రూ.1.12లక్షలు పలికింది. శుక్రవారం కొత్తమిట్టపల్లి గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాట నిర్వహించారు. వేలంపాటలో నూతన్‌కల్‌కు చెందిన నల్లజర్ల ఉదయ-సౌమ్య దంపతులు రూ.1.12లక్షలకు లడ్డూని దక్కించుకున్నారు.

పత్తి రైతులకు నష్టం కలిగేలా కేంద్రం చర్యలు

చింతకాని, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విదేశీ పత్తి దిగుమతులపై 11 శాతం సుంకం తగ్గించడం వల్ల దేశ రైతాంగానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు కోలేటి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో రైతులతో కలసి క్లస్టర్ ఏఈవో కళ్యాణికి వినతిపత్రం సమర్పించారు. సుంకం తగ్గింపుతో టెక్స్‌టైల్స్ కంపెనీలు లబ్ధిపొందుతాయన్నారు. పత్తికి మద్దతు ధర పెంచి రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు తోటకూరి పుల్లారావు, అంబటి మల్లికార్జున్, తాత వెంకటి, నారపోగు వెంకటేశ్వర్లు, వంకాయలపాటి అప్పారావు, సుమన్ పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పీఏగా బోనకల్ ఎంపీవో శాస్త్రి

బోనకల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పీఏగా బోనకల్ ఎంపీవో వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి నియమితులయ్యారు. గడచిన నాలుగు సంవత్సరాలుగా ఎంపీవోగా విధులు నిర్వహిస్తు పలువురి మన్ననలు పొందారు. గురువారం ఆయన డిప్యూటి సీఎం క్యాంపు కార్యాలయంలో విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఆర్.రమాదేవికి ఎంపీవోగా అదనపు బాధ్యతలను జిల్లా అధికారులు అప్పగించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా నర్సింహారావు ఎంపిక

మధిర రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మడుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తోట నర్సింహారావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈనెల 8వతేదీన కలెక్టర్ చేతుల మీదుగా ఆ అవార్డును అందుకోనున్నారు. నర్సింహారావు ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం పట్ల అమ్మ ఆదర్శ కమిటీ చైర్‌పర్సన్ వేమిరెడ్డి నాగలక్ష్మీ, గ్రామపెద్దలు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

పేద విద్యార్థులకు ఎన్ఆర్ఐ ఆర్థికసాయం

వైరా, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొణిజర్ల, ముదిగొండ మండలాలకు చెందిన ఇద్దరు పేద ఇంజనీరింగ్ విద్యార్థులకు మండలంలోని సోమవరం గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు కొండబోలు సురేష్ ఆర్థికసాయం చేశారు. కొణిజర్ల మండలం చిన్నమునగాలకు చెందిన ఎంటెక్ విద్యార్థిని పాపగంటి నవ్య, ట్రిపుల్‌ఐటీలో బీటెక్ చదువుతున్న ముదిగొండ మండలం లక్ష్మీపురంకు చెందిన పెద్దపొంగు నాగ అఖిల అనే విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.పదివేల చొప్పున ఆర్థిక సహాయాన్ని తమ సన్నిహితుల ద్వారా అందజేశారు. శుక్రవారం వైరాలో ఆ విద్యార్థినుల తల్లులకు బెజవాడ వీరభద్రరావు, ప్రభుత్వ ఉపాధ్యాయుడు జీవీ.సూర్యప్రకాశరావు ఈ ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డు అందుకున్న సుధాకర్

కల్లూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న దంతాల సుధాకర్ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని శిల్పకళ వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణా, ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి చేతుల మీదగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్‌కు మండల పీఆర్టీయూ నాయకులు పాకల రమేష్, ఎస్‌కె చాందుసాహెబ్, బోబోలు శ్రీనివాసరావు, ఎండి మౌలానిలు అభినందనలు తెలిపారు.

అదనంగా యూరియా కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మధిర రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో 22గ్రామపంచాయతీల్లోని రైతులకు సరిపడా యూరియా సరఫరా కాకపోవడం పట్ల తీవ్ర ఆందోళన చెందుతున్నారని సీపీఎం డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు అన్నారు. మధిర సొసైటీ పరిధిలో గల రాయపట్నం, మడుపల్లి, ఆత్కూరు, సిరిపురం, మల్లారం గ్రామాల్లో యూరియా అమ్మకం కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కోరుతూ శుక్రవారం సొసైటీ సిబ్బందికి ఒక వినతిపత్రం అందజేశారు. సీపీఎం నాయకులు మందా సైదులు, పాపినేని రాంనర్సయ్య, రాచబంటి రాము, మురళీ, తేలప్రోలు రాధాకృష్ణ, శ్రీరాములు, అంకే శివయ్య, మట్టం శ్రీనివాస్, అంకే సాయి పాల్గొన్నారు.

కిసాన్ మోర్చా జిల్లా సదస్సును జయప్రదం చేయండి

కొణిజర్ల , సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతువ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 10న ఖమ్మంనగరంలోని రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే సంయుక్త మోర్చా జిల్లా సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, సహాయ కార్యదర్శి తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం కొణిజర్లలోని దొండపాటి భవన్‌లో తండుసోమయ్య అధ్యక్షతన జరిగిన రైతు సంఘం సమావేశంలో వారు మాట్లాడారు. వర్షానికి బూజువచ్చిన పెసర పంటను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. డేరంగుల లక్ష్మయ్య, మండల ప్రధాన కార్యదర్శి తండుసోమయ్య, తోటపల్లి సీతారాములు, కొమ్మినేని వెంకయ్య, బండారు వెంకటేశ్వర్లు, శంకరరావు, రామారావు పాల్గొన్నారు.

సరిపడా యూరియా సరఫరా చేయాలి

తల్లాడ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వరి సాగుకు సరిపడా యూరియా సరఫరా చేసి రైతులను ఆదుకోవాలని టీడీపీ తల్లాడ మండల కమిటీ అధ్యక్షుడు సరికొండ శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం తల్లాడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఒక్కో రైతుకు ఒక యూరియా బస్తా చొప్పున అరకొరగా పంపిణీ చేయడం వల్ల సాగు చేసిన వరిపైరుకు సరిపడా యూరియా దొరక్కపోవడంతో రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి యూరియా సరఫరా కోసం కృషిచేయాలని ఆయన కోరారు.

గణనాథుడికి ఘన పూజలు



మర్లపాడులో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



తహసీల్దార్ రాంబాబు దంపతులను సన్మానిస్తున్న సభ్యులు

వినాయక చవితి సందర్భంగా నవరాత్రి వేడుకలలో భాగంగా చవితి మండపాల వద్ద ఏర్పాటు చేసిన గణనాథులకు శుక్రవారం పలు ప్రాంతాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహకులు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పలు ప్రదేశాల్లో మహిళా భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు.



వైరాలో కుంకుమపూజలు చేస్తున్న మహిళా భక్తులు



సత్తుపల్లిలో అన్నదానం ప్రారంభిస్తున్న దయానంద్

ఘనంగా గురుపూజోత్సవం

వైరా, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైరాలో శుక్రవారం గ్రేట్ విజన్ క్లబ్, లయన్స్‌క్లబ్‌ల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. స్థానిక లయన్ కంటి ఆసుపత్రిలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి డాక్టర్‌లు కాపా మురళీకృష్ణ, శ్రీధర్‌గౌడ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. 25మంది రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. జాలా పుల్లారా, లగడపాటి ప్రభాకర్‌రావు, ఉంద్రు శ్యాంబాబు, ఏడునూతల బుచ్చిరామారావు, ఉంద్రు వరలక్ష్మీ, తోటకూర శ్రీకాంత్, చింతోజు నాగేశ్వరరావు, ఉపేంద్రరావు, చెరుకూరి శ్రీనివాసరావు, గద్దే నీరజ, మరికంటి రాంగోపాల్, మిట్టపల్లి నాగేశ్వరరావు, మాదినేని సునీత పాల్గొన్నారు.

కల్లూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని తెలంగాణ గ్రామర్ పాఠశాలలో శుక్రవారం గురుపూజోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ యస్‌కె.ఇస్మాయల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం సర్వేపల్లి రాధకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనమైన నివాళులర్పించారు. పాఠశాల చైర్మన్ యస్‌కె జానీమియా వైస్ చైర్మన్ చందర్‌రావు, డైరెక్టర్స్ రంజిత్‌రెడ్డి, కేశవరావులు ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.



టీచర్లను సన్మానించిన గ్రేట్ విజన్ క్లబ్ నిర్వాహకులు



కల్లూరులో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లో..

సత్తుపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి అన్నారు. ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులను కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి ఘనంగా సన్మానించారు. విద్యాసంస్థలలో సమస్యలను తెలిసిన వెంటనే పరిష్కరిస్తూ వస్తున్నామని, అదేవిధంగా దాతలతోపాటు పలు స్వచ్ఛంద సేవా సంస్థలు పాఠశాలల అభివృద్ధికి సహకరించాలని కోరారు. విద్యార్థులకు పాఠశాలల్లో మెరుగైన వసతి కల్పించడంతోపాటు విద్యాసంవత్సరం రోజే యూనిఫామ్, నోట్‌బుక్స్ అందించిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అని అన్నారు. కార్యక్రమంలో 5మండలాల ఎంఈవోలు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

తరగతి గది.. వైవిధ్యంగా.. బోధన వినూత్నంగా

» వృత్తిలో విభిన్న శైలి అనుసరిస్తున్న ఉపాధ్యాయుడు నాగరాజు

» నేడు కలెక్టర్ నుంచి 'ఉత్తమ' పురస్కారం

ఎర్రుపాలెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురం గ్రామానికి చెందిన వెల్లంకి నాగరాజుది ఉపాధ్యాయ వృత్తిలో విభిన్న శైలి. నాగరాజు ఉన్నత విద్యపూర్తిచేసి ఇంటిదగ్గర ట్యూషన్ చెప్పుకొంటూ జీవనం సాగించాడు. ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తూ ప్రభుత్వ ఉద్యోగానికి ప్రయత్నించాడు. ఉమ్మడి రాష్ట్రంలో 2008లో ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికై 2010నవంబరు 6న సొంత గ్రామమైన జమలాపురం హరిజనవాడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా(ఎస్జీటీ)గా చేరాడు. 14 ఏళ్లుగా సొంతగ్రామంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తూ పెద్దలు, దాతల సహకారంతో తాను పనిచేస్తున్న పాఠశాలను కార్పొరేట్ పాఠశాల స్థాయికి తీసుకొచ్చారు. తాగునీటి కోసం బోర్లను ఏర్పాటుచేశారు. 2018లో జిల్లాలో మొట్టమొదటగా తన సొంత ఖర్చులతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా డిజిటల్ తరగతులను పరిచయం చేశారు. బడిబాట ద్వారా ప్రైవేటు పాఠశాలల వైపు చూడకుండా ప్రతిఏడాది విద్యార్థుల సంఖ్యను పెంచారు. ప్రతీ విద్యార్థిపై శ్రద్ధ వహిస్తూ, విద్యార్థుల్లో లోపాలను సరిచేసి వారి ప్రతిభను వెలుగులోకి తెచ్చారు. వృత్తిని సేవగా భావించి మా మంచి మాస్టారుగా విద్యార్థుల్లో, గ్రామంలో పస్త్రఙ/ఙ/పేరును సంపాదించారు. గతేడాది అక్టోబరు నెలలో సాధారణ బదిలీల్లో భాగంగా వెంకటాపురం ప్రాథమిక పాఠశాలకు బదిలీఅయి ఈఏడాది బడిబాట కార్యక్రమంలో మండలంలోపాఠశాలలో అత్యధిక విద్యార్థులను నమోదుచేసిన ఘనత సాధించారు. ఈ క్రమంలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై శనివారం ఖమ్మంలో జరిగే కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ పురస్కారం అందుకోబోతున్నారు.



బడిబాటలో విద్యార్థులను నమోదు చేస్తున్న నాగరాజు



శ్రీనారాయణ కళాశాలలో అధ్యాపకులను సన్మానిస్తున్న విద్యార్థులు

తరగతి గదిలోనే ప్రపంచ మేధావులు తయారవుతారు

» ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

సత్తుపల్లి, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): నాలుగు గోడల తరగతి గదిలోనే ప్రపంచ మేధావులు తయారవుతారని శ్రీనారాయణ జూనియర్ కళాశాల చైర్మన్ రామకృష్ణమాచార్య అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి కళాశాల ముగిసే వరకు విద్యార్థులే అధ్యాపకులుగా మారి సెల్ఫ్ గవర్నమెంట్ నిర్వహించి ప్రత్యేకత చాటుకున్నారు. విద్యలో రాణిస్తూ ర్యాంకులు సాధించడంలో గానీ, పోటీ పరీక్షలు, ఆటల పోటీలు, విహారయాత్రలతోపాటు ప్రత్యేకంగా దినోత్సవాలను జరపడంలో తమ కళాశాల ముందుంటుందని అన్నారు. అనంతరం అధ్యాపకులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ నవకుమార్, రాగం శ్రీనివాసరావు, మాదిరాజు వాసు, సుధీర్, రామయ్య, అంజనేయులు, జె.వెంకటేశ్వరరావు, రాణి, రేణుక పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన టీడీపీ నాయకులు

మధిర రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను టీడీపీ ఖమ్మం పార్లమెంటరీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, రాష్ట్ర నాయకుడు చేకూరి శేఖర్‌బాబు పరిశీలించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ నాయకుల బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పంట నష్టపరిహారాన్ని చెల్లించి ఆదుకోవాలని కోరారు. టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మార్నీడి పుల్లారావు, మల్లాది హన్మంతరావు, నాయకులు వాసిరెడ్డి నాగేశ్వరరావు, ఉపేంద్ర, యలమంచిలి శివ, మేడా వెంకటేశ్వరరావు, అనుమోలు సతీష్, కర్నాటి వీరభద్రం, జయప్రకాష్, దేవభక్తిని వెంకట్, నల్లమల రాము, రాంబాబు, కర్నాటి శ్రీనివాసరావు, వెంకట్రావ్, సూరోజు రాజు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న నాయకులు

రూ.6.33 లక్షలకు కారేపల్లి సంత వేలం

కారేపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వర స్వామి పశువుల సంత వేలం పాటలను శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. వేలంపాటలో వివిధ ప్రాంతాలకు చెందిన 5గురు డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు. కామేపల్లి మండలం పండితాపురం గ్రామానికి చెందిన మేకల మహేష్‌బాబు రూ.6లక్షల,33వేలకు దక్కించుకున్నారు. మాజీ దేవాస్థానం చైర్మన్ అడ్డగోడ అయిలయ్య, కార్యనిర్వహణాధికారి నల్లమోతు శేషయ్య, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆలయ ఇన్స్‌పెక్టర్ వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ మూడు మోహన్‌చౌవాన్, సత్యం, డేగల ఉపేందర్, వాసిరెడ్డి సంపత్, రంగయ్య, సుభద్ర పాల్గొన్నారు.